కన్నులపండువగా వరుణ యాగం


3లో


PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd


కాలు తీసేయాల్సిన పరిస్థితి నుండి 81 ఏళ్ల వృద్ధుడిని కాపాడిన యశోద వైద్యులు



3లో


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 203 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 19 జులై 2026


# 'విక్రమ్-1'ప్రయోగం విజయవంతం





- భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం
- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది పూర్తి చేసిన షార్
- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం
- ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు

2లో.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన



- 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించిన కేంద్రం
- ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్.. ఉత్తమ నటిగా యామి గౌతమ్
- తెలుగులో పలు విభాగాల్లో సత్తా చాటిన 'పుష్ప 2', 'ఖల్కి', 'కమిటీ కుర్రోళ్లు'
- ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా 'ఆర్టికల్ 370', ఉత్తమ వినోదాత్మక చిత్రంగా 'ఖల్కి'
- ఉత్తమ దర్శకుడిగా 'అమరన్' చిత్రానికి రాజ్ కుమార్ పెరియసామి



**న్యూఢిల్లీ,జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ మిగతా 2లో...

# గోదావరిలో విషాదం..

## చేపలు పట్టేందుకు వెళ్లి ఐదుగురు గిరిజనుల మృతి



- చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి
- పోలవరం జిల్లా ఎటపాక లో విషాదకర ఘటన
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు
- ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్

**పోలవరం జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
మిగతా 2లో...

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

## బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్


**హైదరాబాద్,జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది
మిగతా 2లో...

# సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష భగ్నం

- హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం
- సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స


2లో.

# ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం



- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. మిగతా 2లో...

# పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**హైదరాబాద్ జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.

# అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్




- దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ -వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు
- నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల -నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు
- అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు

**హైదరాబాద్,జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటుమిగతా 2లో...

# అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్

**మొదటిపేజీ తరువాయి**

ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు



సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు
నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం

**మొదటిపేజీ తరువాయి**

ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# 'విక్రమ్-1'ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట,జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు.
ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

**మొదటిపేజీ తరువాయి**

నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

# గోదావరిలో విషాదం..

**మొదటిపేజీ తరువాయి**

ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు.
ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరఫున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

# సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష భగ్నం

## హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం

## సప్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స

**న్యూఢిల్లీ,జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహారదీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శపోలీసులు బలవంతంగా శనివారం ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తగిన వైద్యసహాయం అందించాలంటూ దిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నిరసన ప్రాంతం నుంచి పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఆయన్ను సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తోన్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించా లని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నామని దిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్సా అందించొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో డిమాండ్ చేశారు. ఆయన సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతిలేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతిఒక్కరిని బాధ్యుల్ని చేస్తాను. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీలు లేదు. అది మా హక్కు అని మీడియాతో మాట్లాడారు.


### వాంగ్‌చుక్ తరలింపుతో దీక్షకు దిగిన దీప్కే

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతి ఒక్కరు జంతర్‌మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం అని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని వారాల క్రితం కాక్రోచ్ పార్టీ తొలుత దిల్లీలో నిరసనలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. జులై 20న పార్లమెంట్‌కు శాంతియుత మార్చ్ 'చలో సంసద్'ను నిర్వహించనున్నట్లు కాక్రోచ్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఆ రోజునే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సప్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. మరోవైపు ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంతో అక్కడి సిబ్బందిపై వాంగ్‌చుక్ భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

**మొదటిపేజీ తరువాయి**

అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి



మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు
బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పారించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్



విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## కాలు తీసేయాల్సిన పరిస్థితి నుండి 81 ఏళ్ల వృద్ధుడిని

# కాపాడిన యశోద వైద్యులు

### అత్యాధునిక రక్తనాళాల శస్త్రచికిత్సతో పునరుజ్జీవం

### మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుల అరుదైన విజయగాథ

**హనుమకొండ, జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** మధుమేహం (షుగర్) ఉన్న వృద్ధుల్లో పాదాలపై ఏర్పడే చిన్న గాయాన్ని నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు హెచ్చరించారు. ముఖ్యంగా కాలికి రక్తప్రసరణ తగ్గినప్పుడు 'గ్యాంగ్రీన్' (కుళ్లిపోవడం) ఏర్పడి కాలు తొలగించాల్సిన పరిస్థితి వస్తుంది. ఇటువంటి క్లిష్టమైన స్థితిలో ఉన్న వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన 81 ఏళ్ల వృద్ధుడు కుసుమ భద్రయ్యను అత్యాధునిక వాస్కులర్ శస్త్రచికిత్స ద్వారా యశోద ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా కాపాడారు. కుసుమ భద్రయ్య కుడి కాలి మూడు వేళ్లు గ్యాంగ్రీన్‌కు గురికావడంతో యశోద ఆసుపత్రిని ఆశ్రయించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు, ఆయన కాలికి రక్తప్రసరణ అందించే ప్రధాన ధమనిలో తీవ్రమైన అడ్డంకులు ఉన్నట్లు గుర్తించారు. ఆయనకు 'రైట్ ఫెమురో-పాప్లిటియల్ అక్లూజివ్ డిసీజ్'తో కూడిన 'క్రిటికల్ లింబ్ థ్రెటెనింగ్ ఇస్కీమియా (CLTI`C5)' ఉన్నట్లు తేలింది. దీనికి తోడు టైప్-2 మధుమేహం, రక్తపోటు (బీపీ) కూడా ఉండటంతో కాలు పూర్తిగా తొలగించాల్సిన ముప్పు పొంచి ఉందని వైద్య బృందం




గుర్తించింది.

#### విజయవంతంగా వాస్కులర్ లింబ్-సాల్వేజ్ శస్త్రచికిత్స:

కన్సల్టెంట్ వాస్కులర్ & ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ రంజిత్ కుమార్ ఆనందసు ఆధ్వర్యంలో వైద్య బృందం అత్యవసరంగా అవయవాన్ని కాపాడే వాస్కులర్ శస్త్రచికిత్సను నిర్ణయించింది. రోగికి 'రైట్ ఫెమురో-పాప్లిటియల్ బైపాస్ శస్త్రచికిత్స'తో పాటు గ్యాంగ్రీన్‌కు గురైన కుడి కాలి మూడు వేళ్లను మాత్రమే తొలగించే శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.

#### ఈ శస్త్రచికిత్స ప్రత్యేకతలు:

బైపాస్ ద్వారా కాలికి రక్తప్రసరణను విజయవంతంగా పునరుద్ధరించారు. గ్యాంగ్రీన్‌కు గురైన వేళ్లను మాత్రమే తొలగించి, మిగిలిన కాలును పూర్తిగా కాపాడారు. ఎలాంటి ప్రధాన శస్త్రచికిత్స సమస్యలు లేకుండా ఆపరేషన్ పూర్తయింది. రక్తప్రసరణ సజావుగా సాగడంతో కాలు తిరిగి సురక్షిత స్థితికి చేరింది. రోగి వయస్సు, ఇతర ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని పలువురు నిపుణుల సమన్వయంతో చికిత్స అందించారు. ఇందులో భాగంగా అత్యాధునిక వాస్కులర్ శస్త్రచికిత్సతో పాటు మధుమేహ నియంత్రణ, గుండె సంబంధిత పరీక్షల పర్యవేక్షణ, మూత్రపిండాల పనితీరుపై ప్రత్యేక నిఘా, తీవ్రమైన రక్తహీనతకు రక్తమార్పిడి, యాంటీబయాటిక్స్ , యాంటీకోగ్యులెంట్ చికిత్స, నిరంతర గాయం సంరక్షణ వంటి సమగ్ర వైద్య సేవలను రోగికి అందించినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. సకాలంలో అత్యాధునిక చికిత్సలు అందడం వల్లే అవయవాన్ని కాపాడటమే కాకుండా రోగి జీవన నాణ్యతను మెరుగుపరచడం సాధ్యమైందని వైద్యులు పేర్కొన్నారు.

## దళితురాలి భూములు కాజేయాలని కుట్ర..

## సాదాబైనామా దరఖాస్తులు తిరస్కరించాలి

### బాధిత కుటుంబంతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌కు ప్రజాసంఘాల నేతల వినతి

**మల్లంపల్లి, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని మహమ్మద్‌గౌస్‌పల్లి గ్రామానికి చెందిన నిరుపేద దళితురాలు కన్నం సౌందర్యకు చెందిన విలువైన భూములను అక్రమంగా ఇతరుల పేరిట పట్టా చేసేందుకు కుట్ర జరుగుతోందని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. ఈ భూములకు సంబంధించిన సాదాబైనామా క్రమబద్ధీకరణ దరఖాస్తులన్నింటినీ వెంటనే తిరస్కరించాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. శనివారం మల్లంపల్లి మండల కేంద్రంలో ప్రజా సంఘాల జేఏసీ ములుగు జిల్లా చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్, ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్, ప్రజా సంఘాల జేఏసీ హనుమకొండ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్‌లు బాధిత కుటుంబ



సభ్యులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ మమతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కన్నం సౌందర్య పేరుపై మండలంలోని పలు గ్రామాల్లో అత్యంత విలువైన పట్టా భూములు ఉన్నప్పటికీ, ఆ భూముల విషయం ఆమె కుటుంబానికి తెలియకుండా కొందరు అక్రమార్కులు కాజేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబం ఎలాంటి విక్రయాలు చేయకపోయినా, తప్పుడు పత్రాలు సృష్టించి సాదాబైనామా కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. తప్పుడు పత్రాల ఆధారంగా నిరుపేద దళిత కుటుంబానికి చెందిన భూములను ఇతరుల పేరిట మార్చే ప్రయత్నాలను వెంటనే అడ్డుకోవాలని, సాదాబైనామా కింద వచ్చిన అన్ని దరఖాస్తులను తిరస్కరించాలని వారు అధికారులను కోరారు. అలాగే సంబంధిత భూములన్నింటినీ కన్నం సౌందర్య, ఆమె కుటుంబ సభ్యుల పేర్లపైనే పట్టా నమోదు చేసి, కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మాదాసు జితేందర్, నల్లబెల్లి మేఘం, బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కన్నులపండువగా వరుణ యాగం



### హాజరైన అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, రాష్ట్ర కోశాధికారి హరికిషన్

**ఏటూరునాగారం, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రం, జిల్లా, మండలం సుభిక్షంగా ఉండాలని దూప దీప నైవేద్యం జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో చేపట్టి వరుణయాగం, గణపతి పూజ, గౌరి పూజలు కన్నులపండువగా జరిగాయి. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు ఉదయం 9 గంటలకు గణపతి పూజను స్థానిక సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు చేతుల మీదుగా దీపారద చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాడిపంటలు, సంవృద్ధిగా వర్షాలు కురువాలని, సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ప్రత్యేక పూజలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వరుడికి పూజలు చేసి వరుణ యాగం



ను వేదపండితులు యల్లాప్రగడ మణికంటశర్మ, యల్లాప్రగడ రుత్విక్‌సాయిశర్మ పూజలు జరిపించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ముగించుకొని వరుణయాగంలో ఏర్పాటు చేసిన జలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి బొడ్రాయి అమ్మవారికి అభిషేకం చేసి నూతన వస్త్రాలను అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, రాష్ట్ర కోశాధికారి హరికిషన్ లు అలంకరించారు. భక్తులతో అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. **ఐటీ కార్డు పంపిణీ** దూప దీప నైవేద్యం కింద మంజూరైన ఆలయ అర్చకులకు రాష్ట్ర అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, కోశాధికారి హరికిషన్‌లు ఐడీ కార్డులను రామాలయం అందజేశారు. రామాలయాన్ని కూడా దూప దీప నైవేద్యం స్కీంలో చేర్చాలని రాష్ట్ర అర్చకులకు ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ విన్నవించారు. ఆలయం ప్రాగణం, ఆలయ అభివృద్ధి బాగుందని, ఈసారి స్కీంలో పెట్టించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ, సూర్యనారాయణశర్మ, ఏఎన్‌శర్మ, వెంకటరమణచార్యులు, కర్నె సాంబయ్య, ములుగు జిల్లా అధ్యక్షుడు మూడుంబై రాఘునాథచార్యులు, గౌరవ అధ్యక్షుడు పురుషోత్తంచార్యులు, శివ సత్యనారాయణ, వివేవాకనందస్వామి, రామాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్, కోశాధికారి దీనబాంధవస్వామి, పోగుల లక్ష్మీనారాయణ, కిరణ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్, ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, శివాలయం చైర్మన్ మడుగూరి ప్రసాద్ పాల్గొన్నారు.



## గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో పాల్గొన్న మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు....




**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు పాల్గొని విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను రైతులకు చేరవేయడం అభినందనీయమని అన్నారు. మల్లంపల్లి గ్రామంలో నిర్వహించే కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించి, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, జీవ ఎరువుల తయారీ, ఆధునిక సాగు పద్ధతులు, డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ వ్యవసాయ సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టిరెడ్డి రాంరెడ్డి, వనమ శ్రీనివాస్, మూల వెంకన్న, కొలిపాక శ్రీనివాస్, షాపూర్ మహేందర్, మహమ్మద్ మోసిన్, ఇటుకల కర్ణాకర్, ఇమ్మడి భిక్షపతితో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్, బయాలజీ, మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయులను వెంటనే నియమించాలి: తల్లిదండ్రుల విజ్ఞప్తి








**కరీంనగర్, జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ డాక్టర్ స్ట్రీట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినుల చదువు సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పాఠశాలలో ప్రస్తుతం ఫిజిక్స్, బయాలజీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు రెగ్యులర్ ఉపాధ్యాయులు లేరని తల్లిదండ్రులు తెలిపారు. కొన్ని తరగతుల్లో డిజిటల్ పాఠాలు చూపిస్తున్నప్పటికీ, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులకు అర్హత కలిగిన సబ్జెక్టు ఉపాధ్యాయుల ప్రత్యక్ష బోధన, సందేహాల నివృత్తి అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫిజిక్స్, బయాలజీ, మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారి, కరీంనగర్‌ను తల్లిదండ్రులు కోరారు. ఈ సమస్యపై విద్యాశాఖ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సర్ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..

### • క్యాంపు కార్యాలయంలో బి.ఎల్.ఓల సమక్షంలో సర్ ఫారంలో వివరాల నమోదు...



**కరీంనగర్ టౌన్ జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో 67వ బూత్‌కు చెందిన బూత్ లెవల్ ఆఫీసర్ (బి.ఎల్.ఓ) సమక్షంలో సర్ ఫారంలో తన వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం నమోదైన వివరాలను డిజిటల్ విధానంలో ధ్రువీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమాన్ని ప్రతి అర్హత ఓటరు సద్వినియోగం చేసుకోవాలని, తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని ఓటరు జాబితాను తప్పులులేని విధంగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు సక్రమంగా ఉండేలా ప్రజలు తమ వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అందరూ ఎన్నికల సంఘానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 67వ బూత్ బి.ఎల్.ఓతో పాటు జి.పి.ఓ పరశురాములు, సంబంధిత ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# కాక్రోజ్ జనతా పార్టీ ఉద్యమానికి టీఆర్పీ సంపూర్ణ మద్దతు...

**కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మహిళా అధ్యక్షురాలు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...**

**నీట్ బాధితులకు రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలని టీఆర్పీ డిమాండ్...**

**కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి తెలంగాణ రాజ్యాధికార పార్టీ...**

**విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి: రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా**








**కరీంనగర్, జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఢిల్లీలో కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా కరీంనగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ, కాక్రోజ్ జనతా పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యాలు, అవకతవకలు, నిర్లక్ష్యం కారణంగా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, అనేక కుటుంబాలు నష్టపోయాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన కేంద్ర ప్రభుత్వం దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంలో నష్టపోయిన ప్రతి బాధిత విద్యార్థి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున గట్టిగా డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేయడం, పరీక్షల నిర్వహణలో బాధ్యతారాహిత్యం ప్రదర్శించడం క్షమించరాని నేరమని అన్నారు. విద్యను కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల పిల్లల జీవితాలను ప్రమాదంలోకి నెట్టే విధానాలను టీఆర్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం కోసం జరిగే ప్రతి ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా నిలుస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ దేవి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ వాజిద్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, మండలాల అధ్యక్షులు శివరాత్రి మోహన్, ఓర్సు రాజు, ఓర్సు విమల పార్టీ నాయకులు మహబూబ్ అలీ, కోరే గంగ, గుండోజు పద్మ, నేదునూరి రాజు, నేదునూరి కుమారస్వామి, గుండోజు సదానందం, దారంగుల గణేష్, మోహన్, మధు, ధర్మారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ కార్పొరేషన్‌కు 66 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

● **నలుగురు మహిళలకు అవకాశం.. అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత**


Mobile: 9000333666
Phone: 040-24602484
24603718, 24602383
E-mail: bommaamahesh@gmail.com

TELANGANA PRADESH CONGRESS COMMITTEE
Gandhi Bhavan, Nampally, Hyderabad-500001.

B. MAHESH KUMAR GOUD M.L.C.
President

13 July, 2026

ORDER

In consultation with Shri V.ANJAN KUMAR, President, Karimnagar Corporation Congress Committee, the proposals for the appointment of Division Presidents in Karimnagar Assembly Constituency of Karimnagar District has been approved, with immediate effect.

| Div. No. | Name of the Assembly | Name of the President |
|---|---|---|
| 1 | Karimnagar | Atepu Venu |
| 2 | Karimnagar | Kologani Anil |
| 3 | Karimnagar | Mula Krishna Reddy |
| 4 | Karimnagar | Gadhe Shivaram |
| 5 | Karimnagar | Mohammed Pasha |
| 6 | Karimnagar | Mididoddi Kapil Madhava |
| 7 | Karimnagar | Bandi Mallesham |
| 8 | Karimnagar | Gopu Malla Reddy |
| 9 | Karimnagar | Ramreddy Tirupati Reddy |
| 10 | Karimnagar | Koduri Ravindar Goud |
| 11 | Karimnagar | Chukkala Prashant |
| 12 | Karimnagar | Thalapally Mahesh Goud |
| 13 | Karimnagar | Kotte Swapna |
| 14 | Karimnagar | P Rajesh |
| 15 | Karimnagar | B Srinivas |
| 16 | Karimnagar | Kashipaka Shankaraiah |

**కరీంనగర్, జూలై 18 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ డివిజన్ అధ్యక్షుల నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ నలుగురు మహిళలకు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా అవకాశం కల్పించడం విశేషమన్నారు. కొత్తగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆయన సూచించారు.

## కరీంనగర్‌లో సిటీ బస్సుల ఏర్పాటు కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నేతల వినతి:



**హైదరాబాద్, జూలై 18(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో ప్రజా రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు సిటీ బస్సు సర్వీసులను ప్రారంభించాలని కోరుతూ కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్ సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో కరీంనగర్ నగరం వేగంగా విస్తరిస్తోందని, ప్రస్తుతం సుమారు ఆరు లక్షల జనాభాతో పాటు మూడు వైద్య కళాశాలలు, శాతవాహన విశ్వవిద్యాలయం ఉండగా, ఇటీవల 14 గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనమయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ నగరంలో ప్రభుత్వ సిటీ బస్సు సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు, మహిళలు, వృద్ధులు మరియు సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి రావడం వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, నగరంలోని ప్రధాన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులను అనుసంధానించేలా వెంటనే సిటీ బస్సు సర్వీసులను ప్రారంభించాలని కోరారు. వినతిని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కామిరెడ్డి రామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పెంట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 10వ డివిజన్‌లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..



**కరీంనగర్ టౌన్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని 10వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సొగాని కొమరయ్య ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ సొగాని కొమరయ్య, అపోలో హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ కవులు, కళాకారులకు సముచిత గుర్తింపు కల్పించాలి: బహుజన సాంస్కృతిక సమాఖ్య

**బహుజన సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నాయకులు ప్రొఫెసర్ కోదండరాం, మంత్రి పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్ రాములు నాయక్ లకు వినతిపత్రం సమర్పించారు.**

**అందెశ్రీ జయంతి సందర్భంగా అమరజ్యోతి ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వ కమిటీతో కవులు, కళాకారుల సమావేశం-వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి బీసీఎఫ్ ప్రతినిధుల పాల్గొన్నారు**





**హైదరాబాద్, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** ప్రజావాగ్గేయ కారుడు, తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కవులు, కళాకారుల గుర్తింపు కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని అమరజ్యోతి ప్రాంగణంలో రాష్ట్రవ్యాప్తంగా కవులు, కళాకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినప్పటికీ, గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన కవులు, రచయితలు, జానపద కళాకారులకు ప్రభుత్వ పరంగా తగిన గుర్తింపు, గౌరవం, సంక్షేమ పథకాలు అందించే దిశగా వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఈ సందర్భంగా బహుజన సాంస్కృతిక సమాఖ్య (బీసీఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు సమావేశంలో పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో సాహిత్యం, జానపద కళలు, గీతాలు, బుర్రకథ, ఒగ్గుకథ, డప్పు కళారూపాలు ఉద్యమానికి ప్రాణం పోశాయని, అలాంటి కళాకారుల సేవలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి గౌరవించాలని కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కవులు, కళాకారుల సమగ్ర నమోదు చేపట్టి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయడం, వృద్ధాప్య కళాకారులకు గౌరవ వేతనాలు, ఆరోగ్య భద్రత, కళాకారుల సంక్షేమ నిధి బలోపేతం, యువ కళాకారులకు ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేయాలని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ సంస్కృతి, భాష, సాహిత్య వారసత్వ పరిరక్షణలో కళాకారుల పాత్రను ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆవిర్భావానికి స్ఫూర్తినిచ్చిన కవులు, కళాకారులు, రచయితల సేవలను చరిత్రలో చిరస్థాయిగా నిలిపేలా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని, తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఇది ఒక కీలక అడుగుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి బహుజన సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డం శరత్ నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్షులు బొడ్డు కుమారస్వామి (బి.కె.), ప్రధాన కార్యదర్శి గురుమిళ్ల రాజు, ఉపాధ్యక్షులు సుధామల్ల అశోక్, నాయకులు బందెల సదానందం, ఈర్ల సాంబయ్య, పోడేటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచనా శక్తిని పెంపొందించే అద్భుత సాధనం చెస్






**చెస్ పోటీల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**క్రీడాకారులకు ప్రోత్సాహం నిర్వాహకులు డైరెక్టర్ అనుప్‌కు అభినందనలు**

**కరీంనగర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లో విద్యార్థుల మేధో వికాసం, ఏకాగ్రత మరియు నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన చెస్ పోటీల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, చదరంగం (చెస్) అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాకుండా విద్యార్థుల ఆలోచనా శక్తిని, విశ్లేషణాత్మక దృష్టిని, ఓర్పును పెంపొందించే అద్భుతమైన మేధో క్రీడ అని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు డైరెక్టర్ అనుప్ ప్రతిష్టాత్మకంగా ఈ చెస్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. చెస్ ఆట విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచడమే కాకుండా క్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. జీవితంలోనూ, విద్యలోనూ విజయాలు సాధించేందుకు చెస్ వంటి మేధో క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రాబోయే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో కరీంనగర్‌కు చెందిన యువ క్రీడాకారులు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి, రాష్ట్రానికి, నగరానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపుఓటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించి మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధనతో ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని అన్నారు. చివరగా ఈ బృహత్తర చెస్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన డైరెక్టర్ అనుప్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావ్, కార్పొరేటర్ కె ఏపీపీ చంద్ర, క్రీడా సంఘాల అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు..

# బస్సు నడిపి ఆకట్టుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** బోయినపల్లి మండలం అనంతపల్లి నుంచి వయా కోరంవేములవాడ మీదుగా జగిత్యాలకు వెళ్లే కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బస్సుకు పూజలు నిర్వహించి జెండా ఊపి సర్వీసును ప్రారంభించారు. అనంతరం కొద్దిసేపు స్వయంగా బస్సు నడిపి ప్రయాణికులు, పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే బస్సు నడపడంతో అక్కడ ఉన్న ప్రజలు చప్పట్లతో అభినందనలు తెలిపారు. ఈ కొత్త బస్సు సర్వీస్‌తో అనంతపల్లి, కోరం, వేములవాడ ప్రాంతాల ప్రజలకు జగిత్యాలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోషామహల్ నియోజకవర్గం నుండి యువ సంగ్రామ సభకు బయలుదేరిన బిఆర్ఎస్ శ్రేణులు





**హైదరాబాద్, జూలై 18(పిసిడబ్ల్యూ న్యూస్):** నిరుద్యోగుల సమస్యలను కాంగ్రెస్ సర్కార్ దృష్టికి తీసుకువచ్చేందుకు బి ఆర్,ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో చేపట్టిన యువ సంగ్రామ సభకు గోషామహల్ నియోజకవర్గం లోని జాంబాగ్ డివిజన్ నుండి, బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం అనిల్ కుమార్ నేతృత్వంలో, గోషామహల్ నియోజవర్గం సభ్యత్వ నమోదు ఇంచార్జి, జి నరేందర్ గౌడ్, ఆశిష్ కుమార్ యాదవ్,నియోజవర్గం ఇన్చార్జి ఆర్, వి మహేందర్ కుమార్, ఆదేశాల మేరకు అబిడ్స్ రామకృష్ణ థియేటర్ నుండి, పలు కార్లలో వందనాలు మంది, బి ఆర్ఎస్ కార్యకర్తలతో, జై కేసీఆర్ జై,, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేస్తూ, తరలి వెళ్లారు, ఈ సందర్భంగా బి ఆర్ఎస్ నాయకులు ఏం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ యువ సంగ్రామ సభలో బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ల, నిరుద్యోగ యువత సమస్యలు, ఉపాధి అవకాశాలు, ఉద్యోగ కల్పన, యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల పైన, నిర్వహిస్తున్న ఈ ముఖ్య కార్యక్రమానికి, నగరవ వ్యాప్తంగా పెద్ద ఎత్తున టిఆర్ఎస్ కార్యకర్తలు యువత పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అనిల్ కుమార్ కోరారు, ఈ కార్యక్రమంలో, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు, విష్ణువర్ధన్, రాము, నరేందర్ యాదవ్, అంజన్ కుమార్, సాయిబాబా, సురేష్, గణేష్, నిఖిల్ కుమార్, పప్పా, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితా ఎప్పుడు?



**కరీంనగర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇందిరమ్మ ఇళ్ల మొదటి జాబితా విడుదలై ఎనిమిది నెలలు గడిచినా, రెండో జాబితాపై ఎటువంటి ప్రకటన లేకపోవడంతో లబ్ధిదారుల్లో అసంతృప్తి నెలకొంది. మొదటి జాబితాలో ఎంపికైన కొందరు మాత్రమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయగా, మరికొందరు నిధుల కొరతతో పనులు మధ్యలోనే ఆపేశారు. జూన్ 2న రెండో జాబితా విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించినా, ఆ హామీ ఇంకా నెరవేరలేదు. నిర్మాణం పూర్తయిన వారికి చివరి బిల్లులు, ఉపాధి హామీ కింద చెల్లించాల్సిన మొత్తాలు పెండింగ్‌లో ఉండటంతో లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే రెండో జాబితా ప్రకటించాలని వారు కోరుతున్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి...కేసు దర్యాప్తు కొనసాగింపు.





**కరీంనగర్ జూలై 18(పీసీడబ్ల్యూ న్యూస్):** కొరటపల్లి గ్రామానికి చెందిన నెల్లి తిరుపతి (30) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొరటపల్లి గ్రామానికి చెందిన నెల్లి తిరుపతి (తండ్రి: ఎల్లయ్య), కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 15న మధ్యాహ్నం కూలి పని నుంచి భోజనానికి ఇంటికి వచ్చి తిరిగి పనికి వెళ్తుండగా, కొరటపల్లిషానగర్ మధ్య ఉన్న కోళ్ల ఫారం సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. తిరుపతి నడుపుతున్న ఫ్యాషన్ ప్లస్ మోటార్‌సైకిల్ (నంబర్: TG02BA1638)ను ఎదురుగా వస్తున్న వోల్క్స్‌వ్యాగన్ పోలో కారు (నంబర్: AP29 BQ 0799) ఢీకొట్టింది. కారును కొరటపల్లి గ్రామానికి చెందిన మేకల ప్రభాకర్ యాదవ్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో తిరుపతికి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం (జూలై 18) నెల్లి తిరుపతి మృతి చెందాడు. దీంతో కేసులో తగిన చట్టపరమైన సెక్షన్లు చేర్చి పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# బీజేపీలో ఈటల రాజేందర్ వర్సెస్ బండి సంజయ్.. రాజీ కోసం హైకమాండ్ ప్రయత్నాలు




**హుజూరాబాద్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ బీజేపీలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మధ్య విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకోవడంతో పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తన హుజూరాబాద్ నియోజకవర్గంలో బండి సంజయ్ జోక్యం చేసుకోవడం ఏమిటని ఈటల రాజేందర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా తనను తిరగనివ్వకుండా అడ్డుకుంటున్నారని, తన అనుచరులకు పార్టీ పదవులు రాకుండా బండి సంజయ్ అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా తనకు రావాల్సిన కీలక బాధ్యతలు కూడా దక్కకుండా చేస్తున్నారని ఈటల వర్గం పేర్కొంటోంది. మరోవైపు బండి సంజయ్ కూడా ఈటల రాజేందర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. తనపై ఈటల కావాలనే కుట్ర చేస్తున్నారని, రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తనను తప్పించడంలో ఈటల పాత్ర ఉందని ఆరోపించినట్లు తెలుస్తోంది. ఈటలతో పాటు మరో ఎంపీ కూడా తన కుటుంబాన్ని అభాసుపాలు చేశారని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇద్దరు కీలక నేతల మధ్య పెరుగుతున్న విభేదాలు పార్టీపై ప్రభావం చూపకుండా ఉండేందుకు బీజేపీ హైకమాండ్ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇరువర్గాలతో చర్చలు జరిపి రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# క్షేత్ర స్థాయిలో సర్ ప్రక్రియను పరిశీలించిన సుడా ఛైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,హుజురాబాద్ ఇంచార్జి ప్రణవ్..

### బిఎల్ఏ విధిగా ఓటు సవరణ ప్రక్రియలో పాల్గొనాలి..


### వావిలాల,సైదాబాద్ గ్రామాల్లో పర్యటించిన నేతలు..



**జమ్మికుంట 18(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్ ప్రక్రియలో పార్టీ నియమించిన బిఎల్ఏ,కో ఆర్డినేటర్లు విధిగా పాల్గొని నిరంతరం సమీక్ష జరపాలని కరీంనగర్ సుడా ఛైర్మెన్, హుజురాబాద్ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు. శనివారం రోజున జమ్మికుంట మండల పరిధిలోని వావిలాల, సైదాబాద్ గ్రామాల్లో సర్ కార్యక్రమంపై క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లతో ముచ్చటించారు. ఓటు నమోదు చేసుకునే క్రమంలో ఏదైనా సమస్యలు ఏర్పడుతున్నాయా అని ప్రశ్నించారు. ఏదైన సమస్య ఉత్పన్నం అయినప్పుడు సంబంధిత బిఎల్ఏ లేదా బిఎల్ఓ అధికారులకు తెలియజేసి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. ఎన్నికల కమిషన్ పొడిగించిన సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఓటరును మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ వైస్ చైర్మన్, మండల పట్టణ అధ్యక్షులు, సర్ కో ఆర్డినేటర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మీ కోసం విస్తృతంగా వార్తా కథనం సిద్ధం చేశాను.

### • పురుమల్ల శ్రీనివాస్ సస్పెన్షన్ ఎత్తివేసిన టీపీసీసీ



Dr. Mallu Ravi, MP
Chairman

Ananthula Shyam Mohan
Vice-Chairman

ORDER

The suspension orders issued against Shri Purumalla Srinivas of Karimnagar have been revoked with immediate effect.

The Disciplinary Action Committee (DAC) is hereby directed to advise him to refrain from making unnecessary statements or levelling baseless allegations against the senior leaders of the Party. He is expected to maintain discipline and conduct himself in a manner befitting a responsible party functionary.

**కరీంనగర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ నాయకుడు పురుమల్ల శ్రీనివాస్పై గతంలో విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ క్రమశిక్షణను దృష్టిలో ఉంచుకుని గతంలో తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయాన్ని తాజాగా పునఃసమీక్షించిన టీపీసీసీ, ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆమోదంతో ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో పురుమల్ల శ్రీనివాస్ తిరిగి కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో పూర్తిస్థాయిలో పాల్గొనేందుకు మార్గం సుగమమైంది. పార్టీ బలోపేతం, సంస్థాగత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పని చేయాలని టీపీసీసీ నాయకత్వం ఆయనకు సూచించినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అన్ని వర్గాల నాయకులను కలుపుకుని ముందుకు సాగుతున్న క్రమంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. పురుమల్ల శ్రీనివాస్ సస్పెన్షన్ ఎత్తివేయడాన్ని ఆయన అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. పార్టీ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేసి ప్రజా సమస్యలపై మరింత చురుకుగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా మరింత బలపడే దిశగా నాయకత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలతో సమీక్ష

### పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పనకు అందరి సహకారం అవసరం ఎన్నికల నమోదు అధికారి సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**కల్లూరు, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 116 సత్తుపల్లి (ఎస్సీ) శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ఎస్ఐఆర్ 2026 కార్యక్రమం పురోగతిపై శనివారం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 116సత్తుపల్లి (ఎస్సీ) శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలు తీరు, ఇప్పటివరకు నమోదైన పురోగతి, ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు, సవరణల ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు కావడంతో పాటు అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎన్నికల నమోదు అధికారి వివరించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు కార్యక్రమంపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఓటరు జాబితా మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, ఎన్నికల యంత్రాంగానికి పూర్తి స్థాయిలో సహకరించాలని ఎన్నికల నమోదు అధికారి కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఎన్నికల శాఖ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. వరి తగ్గించి ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**రావికంపాడులో రైతుల అవగాహన సమావేశం.. నీటి పొదుపు, పంటల వైవిధ్యీకరణతో నష్టాలు తగ్గుతాయని వ్యవసాయ అధికారుల సూచన**

**కల్లూరు, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం అసమానంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. సత్తుపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అధ్యక్షతన, కల్లూరు మండల వ్యవసాయ అధికారి రూప ఆధ్వర్యంలో రావికంపాడు గ్రామంలో శనివారం రైతుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నకోరుకొండి రైతులకు ఎల్‌నినో




ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, పంటల వైవిధ్యీకరణ, నీటి యాజమాన్యం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక వరి రకాల స్థానంలో మధ్యకాలిక వరి రకాలను సాగు చేయాలని, సాధ్యమైన చోట డైరెక్ట్ సీడ్ ప్యాడీ (డీఎస్ఆర్) విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఈ విధానం ద్వారా 20 నుంచి 30 శాతం వరకు నీటి వినియోగం తగ్గడంతో పాటు కూలీల కొరత, సాగు వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని తెలిపారు. అలాగే పెసర, మినుము, కంది, నువ్వులు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, పత్తి వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని మెరుగైన ఆదాయం పొందవచ్చని రైతులకు వివరించారు. ప్రతి రైతు తమ పొలంలో ఫామ్‌పాండ్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. వాతావరణ సూచనలను పరిశీలించిన తర్వాతే నారుమడులు వేయాలని, నీటి లభ్యతకు అనుగుణంగా వరి సాగు విస్తీర్ణాన్ని నిర్ణయించుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులు, పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ చర్యలు చేపడితే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

- నారాయణపురం గ్రామసభలో రైతులకు అవగాహన.. సర్వే బృందాలకు సహకరించాలని పిలుపు



**సత్తుపల్లి, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని నారాయణపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పాల్గొని రెవెన్యూ రీసర్వే కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ రీసర్వే కార్యక్రమం లక్ష్యాలు, ప్రాముఖ్యత, రైతులు, భూ యజమానులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూయజమానికి స్పష్టమైన హక్కులు కల్పించడమే రీసర్వే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భూముల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే సమస్యలను నివారించవచ్చన్నారు. గ్రామస్థులంతా సర్వే బృందాలకు పూర్తిస్థాయిలో సహకరించి, తమ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ ఘనతే.. క్రెడిట్ కోసం కాంగ్రెస్‌లో పోటీ: సండ్ర వెంకట వీరయ్య

**పెనుబల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం**

**ఎస్ఐఆర్‌పై పార్టీ శ్రేణులకు అవగాహన.. ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శలు**

**పెనుబల్లి, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెనుబల్లి మండల కేంద్రంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో శనివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై పార్టీ ముఖ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ఓటు చోరీపై మాట్లాడుతుంటే, తెలంగాణలో మాత్రం క్రెడిట్ చోరీ జరుగుతోందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు రూపకల్పన పూర్తిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి ఫలితమేనని పేర్కొన్నారు. ప్రాజెక్టు క్రెడిట్ కోసం కాంగ్రెస్ మంత్రుల మధ్య పోటీ నెలకొన్నదని, ఒక మంత్రికి తెలియకుండా మరో మంత్రి పర్యటనకు రావడం వారి అంతర్గత విభేదాలకు నిదర్శనమని ఆరోపించారు. ఎల్‌నీనో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందన్నారు. ప్రజలు ఆందోళన వ్యక్తం చేసిన తర్వాతే పంపులు ప్రారంభించారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెండో ఎండాకాలాన్ని తలపించే పరిస్థితులు నెలకొన్నాయని, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ సర్వే చూసినా రాబోయేది బీఆర్ఎస్





ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన ఆయన, కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే పోలీసులు కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పెనుబల్లి మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ చెక్కిలాల మోహనరావు, వినీల్‌బాబు, ముందడపు అశోక్, చెక్కిలాల లక్ష్మణరావు, చెలికాని నీలాద్రిబాబు, కొప్పుల గోవిందరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, లగడపాటి శ్రీను, చింతనిప్పు శ్రీను, పెనుబల్లి సర్పంచ్ పాప, నారపోగు శారద, శిరీష, కోట ప్రభాకర్, బెల్లంకొండ శ్రీనివాసరావు, యలమర్తి శ్రీనివాసరావు, కొత్తగుండ్ల అప్పారావు, దొడ్డపనేని రవికుమార్, కొంగల రాంబాబు, మోరంపూడి మధు, సోషల్ మీడియా వారియర్స్ చంటి మరకాల, వెంకీ మరకాలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వంద సీట్లతో 'డాక్టర్స్ మెడికల్ అకాడమీ' హ్యాట్రిక్

- 122 సీట్లతో డాక్టర్స్ మెడికల్ అకాడమీ విజయదుందబి
- డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు రాయల సతీష్ బాబు, ఈగ భరణి కుమార్
- ఎంబిబిఎస్ సీట్లే లక్ష్యంగా గత 9 సంవత్సరాలుగా విజయదుందభి
- సీటు గ్యారంటీ ప్రోగ్రాం ప్రారంభం




**ఖమ్మం ప్రతినిధి, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నీట్ –2026 ఫలితాలలో ఎప్పటిలాగానే 122 సీట్లతో డాక్టర్స్ మెడికల్ అకాడమీ విజయదుందభి మోగించిందని, గత మూడు సంవత్సరాలుగా 100 సీట్లకు పైగా ఎంబిబిఎస్ సీట్లతో హ్యాట్రిక్ సాధించిందని డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు రాయల సతీష్ బాబు, ఈగ భరణి కుమార్ లు అన్నారు. ఖమ్మం నగరంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీ కార్యాలయంలో 122 ఎంబిబిఎస్ సీట్లు సాధించిన సందర్భంగా శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు రాయల సతీష్ బాబు, ఈగ భరణి కుమార్ లు మాట్లాడుతూ... ఆలిండియా ర్యాంకు 237 సాధించడమే కాకుండా అంచనాల ప్రకారం 122 మందికి గవర్నమెంట్ కోటాలో ఎంబిబిఎస్ సీట్లను సాధించే దిశగా అడుగులు వేసామని అన్నారు. ఎటువంటి ఐఐటి ఫౌండేషన్ లేని సాధారణ విద్యార్థులతో ఈ తరహా ఫలితాలు సాధింపచేయటం కేవలం డాక్టర్స్ మెడికల్ అకాడమీకే సాధ్యమని డైరెక్టర్లు రాయల సతీష్ బాబు, ఈగా భరణి కుమార్ లు సంతోషం వ్యక్తం చేశారు. అకాడమీ విద్యార్థులు మార్కులు 500 పైన 4 గురు, 450 పైన 30 మందికి, 400 పైన 107 మందికి గవర్నమెంట్ కోటాలో సీట్లు దాదాపుగా 122 మందికి వచ్చే అవకాశాలున్నట్లు యాజమాన్య వర్గాలు తెలిపాయి. రాహుల్ చైతన్య - 554, మీనాక్షి - 531, ప్రశాంత్ - 500, వైష్ణవి - 500, ఆదిత్య - 499, షారోన్ రోజా–494, కిషోర్ - 490, లోహి - 486, రోహిణి - 485, రాబర్ట్ చౌహాన్ - 484, నిస్సీ - 479, మేఘన - 475, సానియా 475, లక్ష్మీ సాయి - 472, స్నేహ 470, వివేక్ - 469, పన్విక 466, స్నేహ - 464, ఇందుమతి - 463, బిందు 462, రుచిత - 455, రమ్య - 454, శ్రావ్య - 453, ధైర్యవల్లి - 453, ప్రేమ - 452, శర్వాని - 452, భవ్యశ్రీ - 451, కావేరి - 450, వర్ష –450 ఇంతే కాకుండా ఇంకా ఎంతో మంది విద్యార్థులు అధిక మార్కులు సాధించారని పే హర్షాతిరేకంతో విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం పండుగ జరుపుకున్నారు. రీ–నీట్ పరీక్ష కు విద్యార్థులను 35 రోజులపాటు, ఏ ఒక్క ప్రశ్న మిగిలిపోకుండా కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ అధ్యాపక బృందం చేసిన కష్టానికి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అందించిన సహకారంతో 122 సీట్లతో ఉత్తమ ఫలితాలు సాధించి తెలంగాణ రాష్ట్రంలోనే డాక్టర్స్ మెడికల్ అకాడమీ తన ప్రత్యేకతను చాటుకుందని తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు డాక్టర్స్ మెడికల్ అకాడమీ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. **ఈ విద్యా సంవత్సరం సీటు గ్యారెంటీ ప్రోగ్రాం ప్రారంభం** ఈ విద్యా సంవత్సరం డాక్టర్స్ మెడికల్ అకాడమీ లో 25 నుండి 30 మంది విద్యార్థుల వరకు 'ఎంబీబీఎస్ సీటు గ్యారంటీ' ప్రోగ్రామ్ ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంబిబిఎస్ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సమితి సభ్యుడిగా తడికమళ్ల యోబు ఎన్నిక

**సత్తుపల్లి, జూలై 18 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలం బండ్లగూడలోని నవచేతన విజ్ఞాన సమితి గిరి ప్రసాద్ భవన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన డీహెచ్‌పీఎస్ తెలంగాణ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతుల అనంతరం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన కామ్రేడ్ తడికమళ్ల యోబును రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యోబు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా దళితులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నికకు సహకరించిన సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్‌లకు ఆయన కృతజ్ఞతలు




తెలిపారు.

# భారత తుది జట్టులో మార్పులు

- తుది జట్టులోకి కేఎల్ రాహుల్



మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఆదివారం మూడో వన్డే జరగనుంది. తొలి వన్డేలో భారత్ గెలిస్తే.. రెండో వన్డేలో ఇంగ్లండ్ నెగ్గింది. దాంతో సిరీస్ విజేత మూడో వన్డేలో తేలనుంది. క్రికెట్ మక్కాగా పిలిచే లార్డ్స్‌లో ఈ పోరు జరగనుంది. , ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం ఉంది. రెండో వన్డేకు దూరమైన కేఎల్ రాహుల్ మూడో వన్డే కోసం తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యం కారణంగా అతడు రెండో వన్డేకు దూరమయ్యాడు. అతడు ఫిట్‌గా ఉంటే మాత్రం మూడో వన్డే ఆడటం పక్కా. అదే జరిగితే ఇషాన్ కిషన్ పక్కకు తప్పుకోవాల్సిందే. ఇక మరో మార్పు కూడా జరగనుంది. రెండో వన్డే మ్యాచ్ ఆడుతున్న సమయంలో వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయానికి గురయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా అతను మూడో వన్డేలో ఆడే అవకాశాలు లేవు. అతడి స్థానంలో హర్ష్ దూబే తుది జట్టులో ఆడతాడని బీసీసీఐ అధికారికంగా తెలిపింది. రెండో వన్డేలో వాషింగ్టన్ సుందర్ కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఈ విషయాన్ని గిల్ పరోక్షంగా ప్రస్తావించాడు. ఇక ప్రిన్స్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే మాత్రం ప్రసిధ్ కృష్ణ తప్పుకోవాల్సి ఉంటుంది. అయితే అది జరుగుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. ఇక మరోవైపు రోహిత్ శర్మపై కూడా చాలా వార్తలే నడుస్తున్నాయి. చివరి వన్డే అంటూ కొందరు.. అబ్బే అదేం లేదంటూ బీసీసీఐ ఖండించడం చకచకా జరిగిపోయాయి. ఇప్పటికే రోహిత్ శర్మ పేరెంట్స్ లండన్ చేరుకున్నారని సమాచారం. ఏదో జరుగుతుందని లేకపోతే పేరెంట్స్ ఎందుకు వెళ్తారంటూ సరికొత్త ప్రచారం మొదలైంది. టీమిండియా తుది జట్టు (అంచనా): శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, శివమ్ దూబే, హర్ష్ దూబే, అక్షర్ పటేల్, బుమ్రా, గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణ/ప్రిన్స్ యాదవ్

# రోహిత్ రిటైర్ ప్రచారంలో నిజం లేదు

- బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా

తొలి రెండు వన్డేల్లో రోహిత్ శర్మ విఫలం అయ్యాడు. దాంతో అతడి రిటైర్మెంట్‌పై వార్తలు జోరుగా వచ్చాయి. మూడో వన్డే చివరిదంటూ కూడా వార్తలు వచ్చాయి. ఇప్పటికే బీసీసీఐ పెద్దలతో రోహిత్ శర్మ సమావేశం అయినట్లు.. వన్డే ప్రపంచకప్ 2027 ప్రణాళికల్లో రోహిత్ శర్మ లేనట్లుగా వార్తలు వచ్చాయి. ఇదే విషయాన్ని రోహిత్ శర్మకు బీసీసీఐ తెలిపినట్లు.. మూడో వన్డే అనంతరం రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వీటిపై బీసీసీఐ క్లారిటీ ఇచ్చింది.భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలకబోతున్నాడంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై భారత క్రికెట్ నియంత్రణ మండలి స్పష్టత ఇచ్చింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరగనున్న మూడో వన్డే మ్యాచ్ తర్వాత రోహిత్ రిటైర్ అవుతాడంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని బీసీసీఐ ప్రధాన కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. మీడియాలో వస్తున్నవన్నీ కేవలం అవాస్తవాలని ఆయన కొట్టిపారేశారు. రోహిత్ శర్మ భవిష్యత్తు గురించి జరుగుతున్న చర్చలపై దేవజిత్ సైకియా పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. "ఆదివారం లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ రోహిత్ కెరీర్‌లో చివరి మ్యాచ్ కాదు. జట్టు మేనేజ్‌మెంట్ కూడా ఆ దిశగా ఎలాంటి చర్చలు జరపలేదు. రోహిత్ భారత్ తరపున వన్డేల్లో కొనసాగుతాడు. రాబోయే సిరీస్‌లకు కూడా అతడు అందుబాటులో ఉంటాడు" అని తెలిపారు. వన్డే జట్టులో రోహిత్ రెగ్యులర్ సభ్యుడని, సోషల్ మీడియాలో వచ్చే ఊహాగానాలను అభిమానులు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. జట్టు ప్రణాళికల్లో ఉన్నంత కాలం రోహిత్ సేవలు



టీమిండియాకు అందుతాయని స్పష్టం చేశారు.మరోవైపు, రోహిత్ శర్మ భవిష్యత్తుకు సంబంధించిన అంతర్గత సమాచారం మీడియాకు లీక్ కావడంపై బీసీసీఐ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ జట్టుకు సంబంధించిన విషయాలపై మీడియాతో సంభాషించవద్దని బోర్డు సెలక్టర్లకు గట్టిగా సూచించింది. ఇప్పటికే టెస్టులు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ.. 2027 వన్డే ప్రపంచ కప్ గెలవడమే తన తదుపరి లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇప్పటికే కెప్టెన్‌గా టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీలను అందించిన రోహిత్, ఆటగాడిగా వన్డే ప్రపంచ కప్‌ను కూడా ముద్దాడాలని చూస్తున్నాడు. అయితే, 40 ఏళ్లకు చేరువవుతున్న రోహిత్ శర్మ స్థానంలో, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను వన్డే జట్టులో సిద్ధం చేయాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ భావిస్తున్నట్లు ప్రచారం సాగింది. దీనికి తోడు గత రెండు వన్డే మ్యాచ్‌ల్లో రోహిత్ పెద్దగా రాణించకపోవడంతో, గంభీర్-రోహిత్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, అందుకే లార్డ్స్ వన్డే తర్వాత రోహిత్ వీడ్కోలు పలుకుతాడని ఊహాగానాలు జోరందుకున్నాయి. ప్రస్తుతానికి బీసీసీఐ ఇచ్చిన వివరణతో రోహిత్ భవిష్యత్తుపై అభిమానుల్లో ఉన్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి.

# జపాన్ ఓపెన్‌లో చరిత్ర సృష్టించిన పీవీ సింధు



భారత బ్యాడ్మింటన్ స్టార్, తెలుగు తేజం పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్-750 టోర్నీలో చరిత్ర సృష్టించింది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ చరిత్రలో ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళా షట్లర్‌గా సింధు అరుదైన ఘనత సాధించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో చైనాకు చెందిన మాజీ ఒలింపిక్ ఛాంపియన్ చెన్ యుఫీయ్‌ను ఓడించి సింధు ఫైనల్‌లో అడుగుపెట్టింది. రెండేళ్ల తర్వాత బీడబ్ల్యూఎఫ్ టూర్ ఫైనల్‌కు చేరడం కూడా సింధుకు ఇదే తొలిసారి కావడం విశేషం. సెమీఫైనల్లో సింధు ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. తొలి గేమ్‌లో చెన్ యుఫీయ్ నుంచి గట్టి పోటీ ఎదురైనా కీలక సమయంలో అద్భుత ఆటతో 21-19 తేడాతో గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో కూడా ఆధిపత్యం కొనసాగించిన సింధు 15-10 ఆధిక్యంలో ఉండగా యుఫీయ్ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో ఇబ్బంది పడింది. చివరకు ఆమె రిటైర్డ్ హర్ట్‌గా మ్యాచ్ నుంచి తప్పుకోవడంతో సింధు విజేతగా నిలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఈ విజయంతో సింధు మరో ముఖ్యమైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. చెన్ యుఫీయ్‌పై ఆమె చివరిసారి 2019లో విజయం సాధించింది. ఆ తర్వాత వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇప్పుడు జపాన్ ఓపెన్ సెమీస్‌లో గెలిచి ఆ పరాజయాల పరంపరకు తెరదించింది. దాదాపు ఏడేళ్ల తర్వాత యుఫీయ్‌పై మరోసారి విజయం నమోదు చేయడం సింధుకు ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది. మ్యాచ్ ప్రారంభంలో యుఫీయ్ కొంత ఆధిక్యం సాధించినా సింధు వెంటనే పుంజుకుంది. వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 10-5తో ముందంజ వేసింది. అయితే చైనా స్టార్ కూడా పోరాటాన్ని కొనసాగిస్తూ స్కోరును సమం చేసే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య 51 షాట్లతో సాగిన సుదీర్ఘ ర్యాలీ ప్రేక్షకులను అలరించింది. మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో స్కోరు 19-19 వద్ద సమమైంది. అలాంటి ఒత్తిడి పరిస్థితుల్లో సింధు తన అనుభవాన్ని ప్రదర్శించి వరుస రెండు పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా కనిపించింది. నెట్ దగ్గర చురుకైన ఆటతో పాటు క్రాస్ డ్రాప్ షాట్లతో యుఫీయ్‌ను ఇబ్బంది పెట్టింది. విరామ సమయానికి 11-7తో ఆధిక్యంలో నిలిచిన సింధు, ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగించింది. స్కోరు 15-10 వద్ద ఉండగా యుఫీయ్ గాయం తీవ్రత పెరగడంతో మ్యాచ్‌ను కొనసాగించలేక వెనుదిరిగింది. ఈ విజయంతో పీవీ సింధు రెండేళ్ల నిరీక్షణకు ముగింపు పలికింది. ఆమె చివరిసారి 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో ఫైనల్ ఆడి టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత పలు టోర్నీల్లో మంచి ప్రదర్శనలు చేసినప్పటికీ ఫైనల్‌కు చేరలేకపోయింది. ప్రస్తుతం జపాన్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరడం ద్వారా మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకుంటున్న సంకేతాలు ఇచ్చింది.

# ఫుట్‌బాల్ చరిత్రలో కొత్త అధ్యాయం



ఫిఫా అధికారిక ప్రకటన ప్రకారం, జులై 19న న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగే స్పెయిన్ జం అర్జెంటీనా ఫైనల్ విజేత జట్టు సభ్యులు బెస్పోక్ (కస్టమ్) చాంపియన్‌షిప్ రింగ్స్‌ను అందుకోనున్నారు. ఇవి ఫిఫా పోటీల్లో ఇప్పటివరకూ ఎప్పుడూ ఇవ్వని మొదటి రింగ్స్. రింగ్ ఒక వైపు ఫిఫా వరల్డ్ కప్ ట్రోఫీనీ, మరో వైపు విజేత జట్టు గుర్తింపును ప్రతిబింబించేలా డిజైన్ చేశారు. బంగారు రంగులో, నీలి సఫైర్స్, డైమండ్స్‌తో అలంకరించిన ఈ రింగ్స్ అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. మొత్తం 2,026 లిమిటెడ్ ఎడిషన్ రింగ్స్ తయారుచేశారు. వీటిలో 30 రింగ్స్.. విజేత జట్టు సభ్యుల (ప్లేయర్స్, స్టాఫ్) కోసం రిజర్వ్ చేశారు. మిగిలిన సుమారు 1,996 రింగ్స్ ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ కోసం అమ్మబోతున్నారు. ఇప్పటి వరకు అధికారిక ధర ప్రకటించలేదు. ఒక్కో రింగ్ సుమారు ৲25,000 (సుమారు ?21 లక్షలు) ఉండవచ్చని అంచనా ఉంది. బంగారు, డైమండ్స్, సఫైర్స్‌తో తయారైన లగ్జరీ రింగ్ కాబట్టి ధర ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రతి రింగ్ ఇండివిడ్యువల్‌గా నంబర్ చేసినది. ఇది టోర్నమెంట్‌ను స్మరించుకోవడానికి ఒక ప్రత్యేక సంకేతం. ఫిఫా ఈ చర్యను అమెరికన్ స్పోర్ట్స్‌లోని చాంపియన్‌షిప్ రింగ్స్ సంప్రదాయం నుంచి ప్రేరణ పొంది ప్రవేశపెట్టింది. ఈ అప్‌డేట్ ఫుట్‌బాల్ ప్రపంచాన్ని కదిలించింది. కొందరు ఫ్యాన్స్ దీనిని స్వాగతించగా, మరికొందరు ఫుట్‌బాల్‌కు అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్స్ అని విమర్శించారు. అయినప్పటికీ, విజేతలు.. ట్రోఫీ, గోల్డ్ మెడల్స్‌తో పాటు ఈ రింగ్స్‌ను కూడా అందుకోవడం చరిత్రాత్మకం అవుతుంది. రింగ్ డిజైన్‌లో ఫిఫా వరల్డ్ కప్ లోగో, తద్వారా ఈ రింగ్ ప్రత్యేకమైనదిగా గుర్తింపు పొందుతుంది. ఈ ప్రకటన ఫిఫా ఆర్గనైజేషన్ ద్వారా జూలై 16-17న వెలువడింది. ఈ టోర్నమెంట్.. హోస్ట్ దేశాలైన కెనడా, మెక్సికో, ఖూూలో జరుగుతోంది. ఫైనల్‌లో స్పెయిన్ (యూరో చాంపియన్స్), అర్జెంటీనా (డిఫెండింగ్ చాంపియన్స్) మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. ఈ రింగ్స్ విజేతల గౌరవాన్ని మరింత పెంచుతాయని ఫిఫా తెలిపింది. ఫ్యాన్స్ ఈ రింగ్స్‌ను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇవి కలెక్టర్స్ ఐటెమ్‌గా మారవచ్చు. ఫిఫా ఈ కొత్త ట్రెండ్‌తో వరల్డ్ కప్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాలని భావిస్తోంది. మొత్తంగా, ఇది ఫుట్‌బాల్‌లో ఆధునికీకరణకు ఉదాహరణ.

# రామ్‌చరణ్-సుకుమార్ కాంబో


## ఆర్‌సీ 17 పట్టాలకెక్కనుందని ప్రచారం



ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్–రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ప్రియాంక చోప్రా బర్త్‌డే

## విషెస్ చెబుతూ వారణాసి లుక్ విడుదల



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

# ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

## ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్



రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.

# మరోమారు వార్తల్లో నటి నమిత

## స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి



ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బేబీ బంప్‌తో రెబా మోనికా



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.ఆ హీరోయిన్ స్ట్రాంగ్ మెసేజ్ పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు: మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా ఫుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. "ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

# నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్



నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఓటిటిలోకి బాలన్..ది బాయ్



'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ - ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ - ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.